సాక్షి
అనకాపల్లి
ఆదివారం । 26 । మే । 2024



యువకుడిని కాపాడిన లైఫ్‌గార్డ్స్

విశాఖ : రుషికొండ బీచ్‌లో రాజమహేంద్ర వరానికి చెందిన యువకుడు శివ కొట్టుకు పోతుండగా లైఫ్‌గార్డ్స్ కాపాడారు.



సహస్ర తులసీదళార్చన

విశాఖ: కనకమహాలక్ష్మి దేవస్థానంలో శనివారం సహస్ర తులసీదళార్చన నిర్వహించారు.

గరిష్ఠం/కనిష్ఠం
30.8/28.7

వాతావరణం

తేలికపాటి వర్షాలు, ఉరుములతో కూడిన జల్లులు ఒకటి, రెండు చోట్ల కురిసే అవకాశ ముందని ఆర్ఏఆర్ఎస్ వాతావరణ విభాగం శాస్త్రవేత్త వి.గౌరి శనివారం చెప్పారు.

న్యూస్‌రీల్

స్ట్రాంగ్‌రూమ్ చేరిన సర్వీస్ ఓట్లు



స్ట్రాంగ్‌రూమ్‌లో సర్వీస్ ఓట్లను భద్రపరిచాక గదికి సీల్ వేయిస్తున్న డీఆర్వో దయానిధి

తుమ్మపాల: ఈనెల 25వ తేదీ నాటికి 1,262 విభాగాల్లో విధుల్లో ఉన్న సర్వీస్ ఓటర్లు పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటుహక్కును వినియోగించుకున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి బి.దయానిధి తెలిపారు. ఈటీపీబీఎస్ (ఎలక్ట్రానికల్లీ ట్రాన్స్‌మిటెడ్ పోస్టల్ బ్యాలెట్ ద్వారా సర్వీస్ ఓటర్లు) పోస్టల్ బ్యాలెట్‌లను శనివారం రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో స్ట్రాంగ్ రూములో భద్రపరిచినట్లు తెలిపారు. జూన్ 4న అభ్యర్థుల సమక్షంలో కౌంటింగ్ జరుగుతుందన్నారు.

యోగా జడ్జీల శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

అగనంపూడి: యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో వచ్చేనెల 7 నుంచి 9వ తేదీ వరకు రాజమహేంద్రవరంలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి జడ్జీల శిక్షణ కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు అనకాపల్లి జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు ఆంజనేయులు తెలిపారు. లెవెల్–1 శిక్షణలో పాల్గొనబోయే వారు ఇంటర్మీడియట్‌లో ఉత్తీర్ణులై ఉండాలని, కనీస వయసు 21 సంవత్సరాలు ఉండాలని పేర్కొన్నారు. జడ్జిగా ఒక జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొనాలని లేదా యోగా, యోగాసన డిప్లొమా కోర్సు పూర్తి చేసి ఉండాలని తెలియజేశారు. లెవెల్–2 జడ్జి శిక్షణ తరగతుల్లో పాల్గొనదలచిన వారు ఏదైనా డిగ్రీ పూర్తి చేసి ఉండాలని, కనీస వయసు 25 సంవత్సరాలు ఉండాలని తెలిపారు. వైఏపీ లేదా ఎస్ఎస్‌వైఎఫ్ లెవెల్–1 సర్టిఫికెట్ కోర్స్ పూర్తి చేసి ఉండాలని తెలియజేశారు. అర్హత గల వారు ఈ నెల 28వ తేదీలోగా తనను సంప్రదిస్తే జిల్లా నుంచి జాబితాను పంపిస్తామని పేర్కొన్నారు.

కేకే లైన్‌లో డీఆర్ఎం తనిఖీలు



శివలింగపురం యార్డ్ వద్ద తనిఖీలు నిర్వహిస్తున్న డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్

తాటిచెట్లపాలెం: ఈస్ట్ కోస్ట్ రైల్వే, వాల్తేర్ డివిజన్, డివిజనల్ రైల్వే మేనేజర్ సౌరభ్ ప్రసాద్ శనివారం కేకే లైన్ పరిధి శివలింగపురంలో తనిఖీలు నిర్వహించారు. ఈ స్టేషన్‌లో జరుగుతున్న భద్రతా పనులను పరిశీలించారు. సిగ్నలింగ్, ట్రాక్‌ల పెంపు, పాయింట్స్, క్రాస్ ఓవర్స్, ఓవర్ హెడ్ ఎలక్ట్రిఫికేషన్ వంటి పనులను పరిశీలించారు. ఈ ప్రాంతంలో నిత్యం జరిగే ఇనుప ఖనిజ రవాణాను దృష్టిలో ఉంచుకుని, భద్రతకు అత్యధిక ప్రాధాన్యత నివ్వాలని డీఆర్ఎం సూచించారు. ఈ పర్యటనలో డీఆర్ఎంతో పాటు ఏడీఆర్ఎం (ఇన్‌ఫ్రాస్ట్రక్చర్)సుధీర్‌కుమార్ గుప్తా, సీనియర్ డివిజనల్ ఇంజినీర్ విజేంద్ర కుమార్, సీనియర్ డివిజనల్ సిగ్నల్ అండ్ టెలికం ఇంజినీర్ దీప్తాన్షు శర్మ, సీనియర్ డివిజన్ ఎలక్ట్రికల్ ఇంజినీర్ (ట్రాక్షన్) పండిటాం, సీనియర్ డివిజన్ ఎలక్ట్రికల్ ఇంజినీర్ ఆపరేషన్స్ ఎస్.పర్వతం, ఇతర ఉన్నతాధికారులు ఉన్నారు.

గురుకులాల్లో మిగులు సీట్ల భర్తీకి కౌన్సెలింగ్

కంచరపాలెం: డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ గురుకుల కళాశాలల్లో 2024–25 విద్యా సంవత్సరంలో ఇంటర్, 5వ తరగతిలో మిగులు సీట్ల భర్తీకి స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి జిల్లా సమన్వయాధికారి ఎస్.రూపవతి తెలిపారు. విశాఖ జిల్లా పరిధిలో 3, అనకాపల్లి జిల్లా పరిధిలో 8 గురుకులాల్లో మిగులు సీట్లు భర్తీ చేస్తామన్నారు. 5వ తరగతిలో బాలుర అడ్మిషన్ కోసం 28వ తేదీన కంచరపాలెంలోని జిల్లా సమన్వయాధికారి కార్యాలయంలో, బాలికల అడ్మిషన్ కోసం 29వ తేదీ తాళ్లపాలెం అంబేడ్కర్ గురుకులంలో కౌన్సెలింగ్ ఉంటుందన్నారు. 4వ తరగతి స్టడీ సర్టిఫికెట్, ఆధార్, కుల, ఆదాయ ధ్రువపత్రాలతో కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని ఆమె కోరారు. ఇంటర్ ప్రథమ సంవత్సరంలో బాలుర అడ్మిషన్ కోసం 30న సబ్బవరం గురుకులంలో, బాలికలకు 31న మేహాద్రి గెడ్డ గురుకులంలో కౌన్సెలింగ్ ఉంటుందని, తగిన ధ్రువీకరణపత్రాలతో హాజరుకావాలని సూచించారు.

మహా ప్రాణదీపం

- రక్తదానంపై క్రమంగా పెరుగుతున్న అవగాహన
- జిల్లాలో మూడు బ్లడ్ బ్యాంకుల్లో రక్త సేకరణ
- సత్ఫలితాలనిస్తున్న ప్రత్యేక శిబిరాలు

అనకాపల్లి: రక్తదాతల పెద్ద మనసు ఎందరికో ప్రాణం పోస్తుంది. రోగులకు స్వస్థత చేకూరుస్తుంది. వైద్యుల కృషికి తోడై ఆందోళనను దూరం చేసి బాధిత కుటుంబాల్లో ఆనందం నింపుతుంది. రక్తదానం చేసే వారి సంఖ్య క్రమక్రమంగా పెరుగుతోంది. శరీరంలో రక్తం వృథాగా ఉండిపోతోందన్న అవగాహన ప్రజల్లో మరింత పెరిగి, వారు దాతలుగా మారితే రోగులకు మరింత మేలు జరుగుతుంది. అనకాపల్లి ఎన్టీఆర్ వైద్యాలయం, నర్సీపట్నం ఏరియా ఆస్పత్రుల్లో రక్త నిల్వల కేంద్రాలు ఉన్నాయి. అనకాపల్లి పట్టణంలో అభయాంజనేయ రక్త నిల్వల కేంద్రం పేరిట ప్రైవేట్ బ్లడ్ బ్యాంక్ ఉంది. ప్రస్తుతం జిల్లాలో ఈ మూడు కేంద్రాలే ఉన్నాయి. రక్త సేకరణ బస్ నర్సీపట్నం ఏరియా ఆస్పత్రిలో ఉంది. ఇందులో ఇద్దరు టెక్నీషియన్లు ఉంటారు. ఏజెన్సీ ప్రాంతాల్లో తిరుగుతూ గ్రామాల్లో రక్తదానంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారు. సంతలు, తీర్థాలు వంటి జన సమూహాలు ఎక్కువగా ఉన్న చోట శిబిరాలు నిర్వహించి రక్తసేకరణ చేస్తారు. రోటరీ, సంజీవని, ఫస్ట్ బ్లడ్ బ్యాంకులు అప్పుడప్పుడు క్యాంపులు నిర్వహిస్తుంటాయి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇలాంటి క్యాంపుల్లో 100 బ్లడ్ బ్యాగ్‌లు సేకరిస్తే అందులో 30 స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయానికి అందజేయాల్సి ఉంటుంది.

దాతకు ఆరోగ్యం.. స్వీకర్తకు ప్రాణదానం

రక్తదానంపై ఇటీవల కాలంలో అవగాహన పెరిగింది. దాతలు ఎక్కువగా ముందుకు వస్తున్నారు. కళాశాలల విద్యార్థులు, ప్రభుత్వ, ప్రైవేట్ కంపెనీల్లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు స్వచ్ఛందంగా రక్తదానం చేస్తున్నారు. రక్తదానం ప్రాణాపాయంలో ఉన్న వారికి ఊపిరి పోయడమే కాదు దాతలకు కూడా మేలు చేస్తుంది. ముఖ్యంగా పురుషులు రక్తదానం చేయడం వల్ల కొత్త రక్తం వచ్చి ఆరోగ్యవంతులవుతారు. జిల్లా కేంద్రంలోని

ఎన్టీఆర్ ఆస్పత్రిలో రోగులకు రోజుకు 6 నుంచి 8 బ్యాగ్‌ల రక్తం అవసరం ఉంటుంది. నర్సీపట్నం ఏరియా ఆస్పత్రిలో రోగులకు రోజుకు 2 నుంచి 3 బ్యాగ్‌ల రక్తం కావాలి. ప్రభుత్వ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న వారికి అనుబంధ బ్లడ్ బ్యాంకుల నుంచి ఉచితంగా రక్తం ఇస్తారు. ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగుల కోసం వివిధ రకాల పరీక్షల నిమిత్తం ప్రభుత్వం రూ.800లు వసూలు చేసి రక్తం అందిస్తుంది. ప్రైవేట్ బ్లడ్‌బ్యాంకులయితే రూ.1000 నుంచి 2000లు వసూలు చేస్తాయి.



ఎన్టీఆర్ వైద్యాలయంలో శుద్ధి చేసిన రక్త నిల్వల ఫ్రిజ్

ఎవరు రక్తదానం చేయవచ్చంటే..

ఎవరైనా 18 సంవత్సరాలు నిండిన దగ్గర నుంచి 60 సంవత్సరాల వరకు రక్తదానం చేయవచ్చు. ఆరోగ్యవంతులు మూడు మాసాలకు ఒకసారి రక్తదానం చేయవచ్చును. రక్తదానం చేసిన వ్యక్తికి రెండు, మూడు రోజుల్లో శరీరంలో కొత్తరక్తం ఉత్పత్తి అవుతుంది. రక్తదాతలు 48 గంటల ముందు మద్యం సేవించరాదు. రెండు గంటల ముందు పొగతాగరాదు. అటువంటి వ్యక్తుల నుంచి మాత్రమే రక్త నిల్వ సిబ్బంది రక్తం తీసుకుంటారు. ఆరోగ్యవంతులైన వ్యక్తి నుంచి సేకరించిన రక్తాన్ని బ్లడ్ బ్యాంక్ వైద్యులు ప్లాస్మా, ప్యాకెట్ సెల్స్, ప్లేట్‌లెట్స్‌గా విభజిస్తారు. ప్లాస్మా గుండె ఆపరేషన్లు, రోడ్డు ప్రమాదాల్లో క్షతగాత్రులు, కిడ్నీవ్యాధి రోగులకు ఎంతగానో ఉపయోగపడుతుంది. ప్యాకెట్ సెల్స్ ఎనీమియా రోగులు, చిన్నచిన్న ఆపరేషన్లు, హిమోగ్లోబిన్ శాతం తక్కువగా ఉన్న రోగులు తలసేమియా, సికిల్‌సెల్ ఎనిమియా రోగులకు ఉపయోగిస్తారు. ప్లేట్‌లెట్స్‌ను డెంగ్యూ, క్యాన్సర్ రోగులు, రక్తం ఆగకుండా శరీరంలో బ్లీడింగ్ అయిన రోగులకు మాత్రమే వినియోగిస్తారు. ఎన్టీఆర్ వైద్యాలయంలో ప్లాస్మా, ప్లేట్‌లెట్స్, ఎజిటేటర్ మిషన్లు అందుబాటులో ఉన్నాయి.

ఎన్టీఆర్ వైద్యాలయంలో రక్తదాతల వివరాలు

2019-20	2019
2020-21	930
2021-22	1233
2022-23	2231
2023-24	1148



మహిళా కానిస్టేబుల్ స్వచ్ఛంద రక్తదానం

తొమ్మిదిసార్లు రక్తదానం చేశా



రక్తదానం చేయడంతో ఆరోగ్యంగా జీవించవచ్చును. శరీరంలో పాత రక్తం పోయి కొత్త రక్తం ఉత్పత్తి అవుతుంది. రక్తదానం చేయడం వలన దీర్ఘకాలిక వ్యాధుల నుంచి విముక్తి కలుగుతుంది. కొత్త రక్తం శరీరంలో అభివృద్ధి చెందడంవలన శక్తిపెరుగుతుంది. ప్రభుత్వ ఆస్పత్రిలో 9సార్లు రక్తదానం చేశాను. మాకుటుంబ సభ్యులకు కావలసినప్పుడు ఒకసారి ఇక్కడనుంచే తీసుకువెళ్లడం జరిగింది.

–లోకేష్, అనకాపల్లి

వేసవిలో రక్తదాతలు ముందుకు రావాలి



వేసవి కాలంలో రక్తనిల్వలు కొరత ఎక్కువగా ఉంటుంది. విద్యార్థులకు వేసవి సెలవులు, ఉద్యోగులు కుటుంబ సమేతంగా తీర్థయాత్రలు, విలాసయాత్రలకు వెళ్లడం వలన చాలా తక్కువ మంది రక్తదానం చేస్తారు. దాతలు ముందుకు వచ్చి రక్తం ఇస్తే కొరతను అధిగమించవచ్చు. రక్తనిల్వలు తక్కువగా ఉండడంతో 15మంది ఆస్పత్రి ఉద్యోగులు మూడు వారాల క్రితం రక్తదానం చేశారు. కొంతమంది యువత స్వచ్ఛందంగా వైద్యాలయానికి వచ్చి రక్తదానం చేస్తున్నారు. ప్రధాన ప్రదేశాల్లో రక్తదానంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. నెలకు రెండు క్యాంపులు నిర్వహిస్తాం.

–ఎస్.కనకదుర్గ, ఎన్టీఆర్ వైద్యాలయం బ్లడ్‌బ్యాంక్ వైద్యురాలు

హింసకు పాల్పడితే కఠిన చర్యలు

- కౌంటింగ్ రోజున జిల్లా అంతటా 144 సెక్షన్
- ర్యాలీలు, బాణసంచా కాల్చడం నిషేధం
- అవగాహన సదస్సులో ఎస్పీ మురళీకృష్ణ



మాట్లాడుతున్న ఎస్పీ మురళీకృష్ణ

అచ్యుతాపురం : సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ పూర్తయ్యే వరకూ శాంతి భద్రతల పరిరక్షణపై ప్రత్యేక దృష్టి సారించామని ఎస్పీ మురళీకృష్ణ అన్నారు. శాంతి భద్రతల పరిరక్షణపై అచ్యుతాపురం మండలంలోని ఒక ఫంక్షన్ హాల్‌లో శనివారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో గెలుపోటములు సహజమని, ఐదేళ్లకొకసారి జరిగే వాటికోసం కొట్లాడుకోవద్దని సూచించారు. కౌంటింగ్ ప్రక్రియ పూర్తయ్యే వరకూ జిల్లా అంతటా 144 సెక్షన్ అమలులో ఉంటుందని తెలిపారు. జూన్ ఒకటిన వచ్చే ఎగ్జిట్ పోల్స్ ఓ అంచనా మాత్రమేనని పేర్కొన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అవకాశం ఉన్నంత వరకూ కౌంటింగ్ రోజు ఇళ్లకే పరిమితం కావాలని సూచించారు. హింసకు పాల్పడే వారిని గుర్తించి బైండోవర్ చేస్తామని హెచ్చరించారు.

కౌంటింగ్‌కు వచ్చే ఏజెంట్లు ఎలక్ట్రానిక్ పరికరాలు తీసుకురావద్దని సూచించారు. ఏజెంట్లకు పెన్ను, పేపర్లు తామే అందిస్తామని తెలిపారు. ఫలితాలు వచ్చిన తర్వాత గ్రామాల్లో ర్యాలీలు, బాణసంచా కాల్చడం నిషేధించామని పేర్కొన్నారు. అనవసరంగా గొడవలకు పాల్పడి ప్రశాంతమైన జీవితాలను పాడు చేసుకోవద్దని హితవు పలికారు. డీఎస్పీ సత్యనారాయణ, అచ్యుతాపురం సీఐ బుచ్చిరాజు, యలమంచిలి సీఐ గఫూర్, నాలుగు మండలాల ఎస్ఐలు, ట్రాఫిక్ పోలీసులు పాల్గొన్నారు.

బాలల అదృశ్యంపై ఎఫ్ఐఆర్ వేయాల్సిందే

- తొమ్మిదవ అదనపు జిల్లా జడ్జి రత్నకుమార్

చోడవరం రూరల్ : బాలల అదృశ్యంపై బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేస్తే జనరల్ డైరీలో నమోదు చేయడంతో సరిపెట్టకుండా కచ్చితంగా ఎఫ్ఐఆర్ నమోదు చేయాల్సిందేనని తొమ్మిదవ అదనపు జిల్లా జడ్జి కె.రత్నకుమార్ స్పష్టం చేశారు. అంతర్జాతీయ అదృశ్య బాలల దినోత్సవం సందర్భంగా శనివారం చోడవరం కోర్టుల సముదాయంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. హాజరైన కక్షిదారులు, న్యాయవాదులు, పోలీసు సిబ్బందిని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. అదృశ్యమైన పిల్లలను తిరిగి క్షేమంగా ఇంటికి చేర్చగలగడం, అటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా, ఇతర పిల్లలు తప్పిపోకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల పట్ల ప్రజలను చైతన్యవంతులను చేయాలన్న ఉద్దేశ్యంతో మే 25ని అంతర్జాతీయ అదృశ్య బాలల దినోత్సవంగా జరుపుకుంటున్నట్లు ఆయన వివరించారు. బాలల సంరక్షణ ఉద్యమంలో భాగంగా మిస్సింగ్ కేసులకు సంబంధించిన ఫిర్యాదుల పట్ల కచ్చితంగా ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని సుప్రీం కోర్టు ఆదేశాలు జారీ చేసిన సంగతిని గుర్తు చేశారు. దీనిని జిల్లా కోర్టు పరిధిలో మానిటరింగ్ జరుపుతామని, నాలుగు నెలల్లోగా వారి ఆచూకీ తెలియని పక్షంలో జిల్లా టీం పరిశోధన చేస్తుందన్నారు.



మాట్లాడుతున్న జిల్లా జడ్జి రత్నకుమార్

తల్లిదండ్రులు కూడా పిల్లల నడవడికను ఎప్పటికప్పుడు పరిశీలించాలని, వారు సెల్‌ఫోన్ వాడుతున్న తీరును గమనించాలని ఆయన సూచించారు. అదనపు జూనియర్ సివిల్ జడ్జి బి.సూర్యకళ మాట్లాడుతూ పిల్లల చర్యలను తల్లిదండ్రులు గమనిస్తుండాలని సూచించారు. పాఠశాలలకు వారు వెళ్లి వస్తున్న తీరు గమనించాలన్నారు. అదృశ్యమైన బాలలకు సంబంధించిన ఫిర్యాదుల పట్ల పోలీసులు గత వైఖరిని మార్చుకుని, తల్లిదండ్రులను ఆరా తీసి దర్యాప్తును వేగవంతం చేయాలని సూచించారు.

చోడవరం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఇటీవల చోడవరం పట్టణంలో చోటుచేసుకున్న ముగ్గురు బాలల అదృశ్య సంఘటన, వారి ఆచూకీ కనుగొనడంలో సిబ్బంది కృషిని వివరించారు. ఐసీడీఎస్ రావికమతం సీడీపీవో ఎస్.పుష్పాదేవి, లేబర్ ఆఫీసర్ పి.సూర్యనారాయణ పాల్గొన్నారు.

ఏయూ డిగ్రీ పరీక్ష ఫలితాలు విడుదల

ఏయూక్యాంపస్ : ఆంధ్ర విశ్వవిద్యాలయం పరిధిలో డిగ్రీ పరీక్షల ఫలితాలను విడుదల చేసినట్లు పరీక్షల విభాగం డీన్ ఆచార్య డి.వి.ఆర్.మూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. ఫలితాను ఏయూ వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. డిగ్రీ ఆరో సెమిస్టర్‌లో మొత్తం 27,603 మంది పరీక్షకు హాజరవగా 27,483 మంది ఉత్తీర్ణత సాధించారు. దీంతో 99.57 శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. బీఏ (సీబీసీఎస్)లో 99.68, బీబీఏ(సీబీసీఎస్)లో 98.66, బీకాం(కంప్యూటర్స్)లో 99.71, బీకాం (జనరల్)లో 99.92, బీహెచ్ఎంసీటీలో 100, బీఎస్సీలో 99.52, బీఎస్సీ ఫుడ్ టెక్నాలజీలో 90, బీఎస్సీ ఫుడ్ సైన్స్‌లో 100, బ్యాచిలర్ ఆఫ్ వెటర్నరీలో 100, బ్యాచిలర్ ఆఫ్ ఓకేషన్‌లో 100 మంది ఉత్తీర్ణత సాధించారు.

రేపటి నుంచి పాలిసెట్ కౌన్సెలింగ్

తుమ్మపాల: పాలిసెట్–2024లో అర్హత సాధించిన విద్యార్థులకు ఈ నెల 27 నుంచి కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభమవుతుందని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ ఐ.వి.ఎస్.ఎస్.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ 3వ తేదీ వరకు ధ్రువపత్రాల పరిశీలన జరుగుతుందన్నారు. ఈ నెల 31 నుంచి జూన్ 5 వరకు ఆప్షన్లు ఎంపిక చేసుకునేందుకు వీలుందన్నారు. కౌన్సెలింగ్ ఫీజు ఓసీ/బీసీ అభ్యర్థులు రూ.700, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.250 చెల్లించాలన్నారు. జూన్ 7న సీట్ కేటాయింపు గురించి తెలుస్తుందని, 10 నుంచి మొదటి సంవత్సరం తరగతులు ప్రారంభం కానున్నాయన్నారు.

ర్యాంకుల వారీగా కౌన్సెలింగ్ వివరాలు

తేదీ	ర్యాంక్
27.05.2024	1-12000
28.05.2024	12001-27000
29.05.2024	27001-43000
30.05.2024	43001-59000
31.05.2024	59001-75000
01.06.2024	75001-92000
02.06.2024	92001-108000
03.06.2024	108001- చివరి ర్యాంక్

ప్లాంటేషన్ పనులకు ప్రాధాన్యం

- ఎన్ఆర్ఈజీఎస్ జాయింట్ కమిషనర్ శివప్రసాద్

సబ్బవరం : వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్లాంటేషన్ పనులకు ప్రాధాన్యం ఇవ్వాలని ఎన్ఆర్ఈజీఎస్ రాష్ట్ర జాయింట్ కమిషనర్ శివప్రసాద్ సూచించారు. మండలంలోని బాటజంగాలపాలెంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా చేపడుతున్న మినీ అమృత సరోవర్ పనులను ఆయన శనివారం పరిశీలించారు. సుమారు రూ.8.84 లక్షల ఉపాధి నిధులతో నీటి నిల్వకు సంబంధించి చేపడుతున్న ప్రాజెక్టు పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. దీని ద్వారా వర్షపు నీటిని నిల్వ చేసి వాటర్ హార్వెస్టింగ్ చేస్తే బోర్ల కింద పొలాలకు ఎటువంటి నీటి వనరుల కొరత లేకుండా పంటలను సమృద్ధిగా పండించుకోవచ్చని ఆయన సూచించారు. మండలంలో సుమారు 5 వేల మంది ఉపాధి కూలీలతో 50 వరకూ ఫారం పాండ్స్ ఏర్పాటు చేస్తున్నట్లు ఎన్ఆర్ఈజీఎస్ అధికారులు ఆయనకు వివరించారు. కూలీలకు రూ.300 వరకూ వేతనం గిట్టుబాటు అయ్యేలా పనులు చేయిస్తున్నట్లు తెలిపారు. ఆయనతో పాటు జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ ఈ.సందీప్, అనకాపల్లి క్లస్టర్ ఏపీడీ మణికుమార్, విశాఖపట్నం ఏపీడీ ఆంజనేయులు, ఎంపీడీవో రామ్మోహనరావు, ఏపీవో మళ్ల శ్రీనివాసరావు, ఈసీ పరమేష్ పాల్గొన్నారు.



మినీ అమృత సరోవర్ పనులపై అధికారులకు సూచనలిస్తున్న ఎన్ఆర్ఈజీఎస్ జాయింట్ కమిషనర్ శివప్రసాద్

చోడవరంలో ఉద్యోగ విజయోత్సవం -8లో

క్లుప్తంగా

సైనిక్‌స్కూల్‌కు ఎంపికైన ముకుందపురం విద్యార్థి



పోట్ల శ్రీరామ్ రాకేశ్

మాడుగుల రూరల్ : ముకుందపురం గ్రామానికి చెందిన పోట్ల శ్రీరామ్ రాకేశ్ సైనిక్‌స్కూల్ ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణత సాధించి ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో గల సైనిక స్కూల్‌కు ఎంపిక య్యాడు. శ్రీరామ్ రాకేశ్ 1వ తరగతి నుంచి 5 వ తరగతి వరకు చోడవరంలో ఒక ప్రైవేటు స్కూల్లో చదివాడు. 6 నుంచి 9 వ తరగతి వరకు తెనుగుపూడి గురుకుల పాఠశాలలో చదువుతూ ఈ ఏడాది జనవరి 28న విశాఖలో జరిగిన సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణత సాధించాడు. త్వరలో జరిగే కౌన్సిలింగ్‌కు హాజరవ్వాలని ఉత్తరప్రదేశ్ నుంచి సమాచారం వచ్చిందని రాకేశ్ తల్లిదండ్రులు పోట్ల వీర్రాజు, వీరాలక్ష్మి శనివారం తెలిపారు. వీర్రాజు తాపీ మేస్త్రీగా పనిచేస్తుండగా, తల్లి గృహిణి. సామాన్య కుటుంబంలో జన్మించిన రాకేశ్ మంచి ర్యాంకు సాధించడం పట్ల గ్రామస్తులు, కుటుంబ సభ్యులు రాకేశ్‌ను అభినందించారు.

డిప్యూటీ డీఈవో పరీక్షకు 60.57 శాతం హాజరు

మహారాణిపేట : ఏపీపీఎస్సీ ఆధ్వర్యంలో డిప్యూటీ డీఈవో పరీక్ష శనివారం ప్రశాంతంగా జరిగింది. జిల్లాలో 14 కేంద్రాల్లో జరిగిన పరీక్షకు 4,497 మందికి గాను 2,724 మంది హాజరయ్యారు. 1,773 మంది గైర్హాజరయ్యారు. తొలి రోజు 60.57 శాతం హాజరు నమోదైనట్లు అధికారులు తెలిపారు.

ఏలేరు కాలువలో పడి వ్యక్తి దుర్మరణం




ఏలేరు కాలువ నుంచి బాలశంకర్ మృతదేహాన్ని తీస్తున్న అగ్నిమాపక సిబ్బంది, సంఘటన స్థలంలో సీఐ శంకరరావు

అనకాపల్లి : బహిర్భూమికి వెళ్లి తుమ్మపాల ఏలేరు కాలువలో ప్రమాదవశాత్తూ కాలుజారి పడి దేవీనగర్‌కు చెందిన వెదురుపర్తి బాలశంకర్ అనే వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. పట్టణ సీఐ జి.శంకరరావు తెలిపిన వివరాలివి. మృతుడి సోదరుడు నాగ వీరవెంకట సత్యనారాయణమూర్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి వెళ్లి మృతదేహాన్ని వెలికి తీసి పోస్టుమార్టం కోసం ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించారు. ఘటనపై మూర్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

సరకు రవాణాలో సరికొత్త వ్యూహాలు

ఈస్ట్‌కోస్ట్ గేట్ వే ఆఫ్ ఇండియాగా నౌకాయానంలో అంతర్జాతీయంగా ఎదుగుతున్న విశాఖపట్నం పోర్టు అథారిటీ గేరు మార్చింది. సరకు రవాణాలో ఏటికేడూ వృద్ధి నమోదు చేసుకుంటున్న పోర్టు.. దేశంలోని మేజర్ పోర్టులతో పోటీ పడుతోంది. ఎప్పటికప్పుడు సరకు రవాణాలో సరికొత్త వ్యూహాలను అనుసరిస్తోంది. ఇందులో భాగంగానే హ్యాండ్లింగ్ కోసం మోడ్రన్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ వ్యవస్థను అందుబాటులోకి తీసుకొస్తోంది. మరోవైపు భారీ నౌకలను సైతం సులువుగా బెర్తింగ్ చేసేలా బెర్తులను ఆధునికీకరిస్తోంది.

– సాక్షి, విశాఖపట్నం



విశాఖపట్నం పోర్టు

- విశాఖ పోర్టు అథారిటీ వినూత్న ప్రణాళికలు
- సరకు రవాణాలో ఆధునిక సాంకేతికత
- రూ.14.03 కోట్లతో మోడ్రన్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్
- రూ.66.12 కోట్లతో ఈక్యూ–6 బెర్త్ అత్యాధునిక యాంత్రీకరణ
- భారీ నౌకలను సైతం సులువుగా హ్యాండ్లింగ్ చేసేలా నిర్మాణం
- 100 మందికి పరోక్షంగా ఉపాధి అవకాశాలు

వచ్చే మూడేళ్లలో నిర్వహణ సామర్థ్యాన్ని పెంపొందించడంతో పాటు నంబర్ వన్ పోర్టుగా అభివృద్ధి చెందేందుకు విశాఖపట్నం పోర్టు అథారిటీ అడుగులు వేస్తోంది. సామర్థ్యాన్ని మరింత పెంచుకునేలా మౌలిక వసతుల కల్పనతో పాటు జెట్టీలు, కంటైనర్ టెర్మినల్ విస్తరణ, రవాణా, అనుసంధాన ప్రాజెక్టులపై ప్రధానంగా దృష్టిసారించింది. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న నిధులతో పాటు చానళ్లు, బెర్తులను మరింత లోతుగా విస్తరించడం ద్వారా అంతర్గత వనరుల నుంచి ఆదాయం ఆర్జించేలా సరికొత్త మార్గాలను అన్వేషిస్తోంది. వివిధ జెట్టీల ద్వారా మాంగనీస్, బొగ్గు, జిప్సం, బాక్సైట్ తదితర ఖనిజాలు, ఇతర ప్రధాన ఉత్పత్తులు రవాణా జరుగుతుంటుంది. భవిష్యత్‌లో వీటి రవాణా సామర్థ్యం పెరిగే అవకాశం ఉన్నందున జెట్టీ సామర్థ్యాన్ని కూడా పెంచేలా పోర్టు పనులు ప్రారంభించింది. రైల్వేల ద్వారా కార్గో హ్యాండ్లింగ్ వేగవంతం చేసేందుకు ప్రత్యేక చర్యలకు వీపీఏ ఉపక్రమించింది. పోర్టులోని ఆర్‌అండ్‌డీ యార్డులో వ్యక్తిగత క్యాబిన్‌ల నిర్మాణం, ప్యానెల్ ఇంటర్‌లాకింగ్ ద్వారా యార్డును రైల్వే ప్రమాణాలకు అనుగుణంగా పునరుద్ధరించే పనులు చురుగ్గా సాగుతున్నాయి.

ఈక్యూ–6 అభివృద్ధికి శ్రీకారం

పోర్టు ఇన్నర్ హార్బర్‌లోని ఈక్యూ–6 బెర్త్ అభివృద్ధి, యాంత్రీకరణ పనులను మెస్సర్స్ ఎవర్ సన్ మెరైన్ ట్రేడ్ ప్రైవేట్ లిమిటెడ్‌కు అప్పగించింది. పీపీపీ విధానంలో ఈ పనులను ఆ సంస్థ త్వరలో చేపట్టనుంది. ప్రస్తుతం ఈ క్యూ–6 బెర్త్ పాక్షిక యాంత్రీకరణతో ఉంది. దీని పొడవు 255 మీటర్లు. యాంత్రీకరణలో భాగంగా క్రేన్‌లు, లోడర్స్, ట్రక్స్, పోర్క్ లిఫ్ట్స్ వంటి పరికరాలు అందుబాటులోకి వస్తాయి. రూ.66.12 కోట్ల విలువైన ఈ ఆధునికీకరణ పనులు పూర్తయితే.. ఏడాదికి 2.62 మిలియన్ మెట్రిక్ సరకును రవాణా చేసే సామర్థ్యానికి పోర్టు చేరుకోనుంది. బెర్త్‌ను ఆధునికీకరించడం ద్వారా 50000 డీడబ్ల్యూటీ సామర్థ్యం, 200 మీటర్ల పొడవు 32 మీటర్ల బీమ్, 11.50 మీటర్ల డ్రాఫ్ట్ కలిగిన నౌకలను కూడా హ్యాండిల్ చేసే అవకాశం కలుగుతుంది. 15 నెలల్లో ఈ పనులు పూర్తి చేసేందుకు లక్ష్యంగా నిర్దేశించుకుంది. ఈ బెర్త్‌ను అభివృద్ధి చేయడం ద్వారా 100 మందికి నేరుగా, మరికొంత మందికి పరోక్షంగా ఉపాధి లభించనుంది.

మోడ్రన్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్

మరోవైపు సరకు హ్యాండ్లింగ్ చురుగ్గా నిర్వహించేందుకు అత్యాధునిక పద్ధతులను అనుసరిస్తోంది. ఇందులో భాగంగా జాతీయ సాంకేతిక కేంద్రం(ఎన్‌టీసీపీడబ్ల్యూసీ) వెసెల్ మేనేజ్‌మెంట్ సిస్టంతో రూ.14.03 కోట్లతో పరస్పర అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకుంది. సరకు రవాణాలో వెసెల్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ అనేది అత్యంత కీలకమైన అంశం. పోర్టుల్లో ట్రాఫిక్ నియంత్రణకు ఈ వ్యవస్థ అత్యంత కీలకమైనది. కార్గోని వీలైనంత త్వరగా ఎగుమతి దిగుమతులు చేసేందుకు ఈ మోడ్రన్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ ఉపయుక్తంగా నిలుస్తుంది.

జంపెన వాసవీమాత ఆలయంలో హుండీ చోరీ



పగులగొట్టి పొలాల్లో పడేసిన హుండీ



దుండగులు పగులగొట్టిన ఆలయంలోని బీరువా

మాడుగుల రూరల్ : మండలంలో జంపెన గ్రామంలో గల వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారి హుండీ చోరీకి గురైంది. శుక్రవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఆలయం తలుపులు తాళం పగులగొట్టి లోపలకు ప్రవేశించి బీరువాను తెరిచారు. బీరువాలో వున్న చీరలు చిందర వందరగా పడవేసారు. ఆలయంలో గల హుండీని పగులగొట్టి అందులోని సుమారు రూ. 25000 నగదును తస్కరించారు. ఈ హుండీని తీసుకెళ్లి సమీపంలో గల పొలాల్లో పడేశారు. శనివారం ఉదయం గ్రామంలో గల వాసవీ క్లబ్ సభ్యులు ఆలయానికి వెళ్లినపుడు గుడి తలుపులు తీసి ఉండడాన్ని గమనించి వెంటనే ఆలయ కమిటీవారికి సమాచారం అందించారు. కమిటీ వారు స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వడంతో శనివారం వారు వచ్చి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇటీవల మండలంలో పలు గ్రామాల్లో గ్రామ దేవతల హుండీలు చోరీ ఘటనలు చోటు చేసుకున్నాయి. కాగా తాజాగా వాసవీమాత ఆలయంలో ఈ నెల 18న వాసవీమాత జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హుండీలో దాతలు వేసిన నగదు చోరీకి గురికావడం పట్ల వాసవీక్లబ్ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు.

తోట చెరువులో వ్యక్తి మృతదేహం లభ్యం

మాడుగుల రూరల్/ యలమంచిలి రూరల్ : యలమంచిలి తండాలదిబ్బ కూడలికి సమీపంలో వున్న తోట చెరువులో శుక్రవారం 35 ఏళ్ల వయసుగల వ్యక్తి మృతదేహం లభ్యం అయింది. మృతుడిది మాడుగుల మండలం ఎం.కోటపాడు గ్రామానికి చెందిన శానాపతి రామాంజనేయలు (35)గా గుర్తించారు. ఈ మేరకు పోలీసుస్టేషన్‌లో మిస్సింగ్ కేసుగా నమోదై ఉందని స్థానిక ఎస్‌ఐ పి.దామోదర్‌నాయుడు శనివారం సాయంత్రం తెలిపారు. రామాంజనేయులు ఈ నెల 21 వ తేదీ రాత్రి నుంచి కనిపించడం లేదు. ఆయన ఆచూకీ కోసం ఎంత వెదికినా ఫలితం లేకపోవడంతో ఈ నెల 23 తేదీన రామాంజనేయులు భార్య దేవి స్థానిక పోలీసు స్టేషన్‌కు ఫిర్యాదు చేశారు. 24న యలమంచిలి చెరువులో రామాంజనేయులు మృతదేహం బయల్పడింది. మృతుడి భార్య, బంధువులు శనివారం యలమంచిలి వెళ్లి మృతదేహాన్ని గుర్తించారు. పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు మృతదేహం అప్పగించడంతో శనివారం అంత్యక్రియలు జరిపారు. కాగా ఈ ఘటనపై అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి యలమంచిలి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం నివేదిక వచ్చిన తర్వాత రామాంజనేయులుది హత్యా? ఆత్మహత్యా? నిర్ధారిస్తామని యలమంచిలి సీఐ షేక్ గఫూర్ తెలిపారు.

ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో 'ఉద్యోగ విజయోత్సవం'





నియామక ఉత్తర్వులతో విద్యార్థులు, అధ్యాపకులు (ఇన్‌సెట్) అత్యధిక వేతనం పొందిన విద్యార్థి కార్తీక్

చోడవరం రూరల్ : ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు 55 మంది కంప్యూటర్, మెకానికల్ విభాగాల్లో ఆరు కంపెనీల్లో ఉద్యోగావకాశాలను సాధించారు. వీరిలో కంప్యూటర్ బ్రాంచి విద్యార్థి పి.అనురాగ్ కార్తీక్ ఆల్కోవెక్స్ ప్రాడక్ట్ స్టూడియో కంపెనీలో అత్యధికంగా 5.8 లక్షల రూపాయల వార్షిక వేతనంతో నియమితుడయ్యాడు. అలాగే రూ.3.05 లక్షల వార్షిక వేతనంతో టెక్నిక్స్ ఇంటిగ్రేషన్ టెక్నాలజీస్ కంపెనీకి ఐదుగురు విద్యార్థులు, రూ.2.98 లక్షల వార్షిక వేతనంతో మేధా సెర్వో డ్రైవ్స్ కంపెనీకి ముగ్గురు, రూ.2.43 లక్షల వార్షిక వేతనంతో డైకిన్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీకి అత్యధికంగా 34 మంది, రూ.2.32 లక్షల వార్షిక వేతనంతో వీల్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీకి ఏడుగురు, రూ.1.40 లక్షల వార్షిక వేతనంపై ఐదుగురు విద్యార్థులు పిక్సెల్ విండ్ టెక్నాలజీస్ కంపెనీకి ఎంపికయ్యారు. ఈ మేరకు శనివారం కళాశాలలో ప్రిన్సిపాల్ ఎ.నాగరాజు అధ్యక్షతన ఉద్యోగ విజయోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా అత్యధిక వేతనంతో నియామకం పొందిన విద్యార్థి అనురాగ్ కార్తీక్ తల్లిదండ్రులను సత్కరించారు. నియామకాలు పొందిన 55 మంది విద్యార్థులకు నియామక పత్రాలను అందజేశారు. కళాశాల హెచ్‌ఓడీలో డి.రజని, వై.వెంకటరత్నం, అధ్యాపకులు మాట్లాడుతూ మరిన్ని తరగతి గదులు, సాంకేతిక పరికరాలను అందించి ప్రోత్సహించాలని కోరారు.

రేబాక పాలిటెక్నిక్ కళాశాలలో..

తుమ్మపాల : కృషి పట్టుదలతో చదివి ఉన్నత స్థానాలకు చేరే విధంగా ప్రతి విద్యార్థి లక్ష్యం చేసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారిని ఎం.వెంకటలక్ష్మమ్మ అన్నారు. మండలంలో రేబాక పాలిటెక్నిక్ కళాశాలలో శనివారం జరిగిన ఉద్యోగ విజయోత్సవ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు మంచి ఫలితాలు సాధించి ఉద్యోగాలు పొందడం వల్ల సమాజానికి, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురాగలరని అన్నారు. కళాశాలకు చెందిన 2023–24 వార్షిక సంవత్సరంలో 76 మంది విద్యార్థులు వివిధ కార్పొరేట్ సంస్థల్లో ఉద్యోగాలు సాధించారని ప్రిన్సిపాల్ ఐవీఎస్ఎస్ శ్రీనివాసరావు అన్నారు. ఈ కార్యక్రమంలో ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ అధికారి డీవీ రమణ, వివిధ శాఖాధిపతులు పాల్గొన్నారు.

ఉజ్వల భవిష్యత్‌కు కేరాఫ్ ఆర్‌జీయూకేటీ

- అందుబాటులో అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విద్య
- గ్రామీణ ప్రాంత పేద విద్యార్థులకు మంచి అవకాశం
- ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ప్రవేశాల్లో నాలుగు శాతం డిప్రివేషన్ స్కోర్
- ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం
- జూన్ 25 ఆఖరు తేదీ

సాక్షి, విశాఖపట్నం: రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం(ఆర్‌జీయూకేటీ)లు అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విద్యకు చిరునామాగా నిలుస్తున్నాయి. ముఖ్యంగా గ్రామీణ ప్రాంత పేద విద్యార్థుల ఉన్నత విద్య కలను సాకారం చేస్తూ వారు అత్యున్నత స్థానాల్లో కొలువులు సాధించేందుకు ఆసరాగా ఉంటున్నాయి. 10వ తరగతి మార్కుల ఆధారంగా ఇందులో ప్రవేశాలు లభిస్తాయి. రాష్ట్రంలో నాలుగు క్యాంపస్లు శ్రీకాకుళం, ఇడుపులపాయ, నూజివీడు, ఒంగోలులో ప్రవేశాలకు ఇప్పటికే నోటిఫికేషన్ విడుదలైంది. ఒక్కో క్యాంపస్‌లో 1100 సీట్లు (ఎకనామికల్లీ బ్యాక్ వర్డ్ క్లాసెస్ రిజర్వేషన్ కలిపి) అందుబాటులో ఉన్నాయి.

ప్రభుత్వ పాఠశాలల్లో 10వ తరగతి పూర్తి చేసిన విద్యార్థులకు నాలుగు శాతం డిప్రివేషన్ స్కోర్ ఇస్తారు. 10వ తరగతి మార్కులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లు, ఎన్‌సీసీ, స్పోర్ట్స్, స్కౌట్, ఆంగ్లో ఇండియన్, దివ్యాంగులు వంటి ప్రత్యేక కోటాలు ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు.

అత్యుత్తమ విద్య..

ఆర్‌జీయూకేటీలో ఆరేళ్లు చదువుకునే అవకాశం లభిస్తుంది. రెండేళ్ల ప్రీ యూనివర్సిటీ కోర్సు, నాలుగేళ్ల ఇంజినీరింగ్ కోర్సు చదువుకోవచ్చు. లేదంటే పీయూసీ పూర్తిచేసి రిలీవ్ కావచ్చు. పీయూసీ అనంతరం ఇంజినీరింగ్‌లో కొనసాగవచ్చు. సీఎస్ఈ, ఈసీఈ, సివిల్, మెకానికల్, ట్రిపుల్‌ఈ, ఐటీ వంటి బ్రాంచ్‌తో పాటు ఇడుపులపాయ, నూజివీడుల్లో ప్రత్యేక బ్రాంచ్‌లు నిర్వహిస్తున్నారు. ఆర్‌జీయూకేటీలో ఇంజినీరింగ్ పూర్తిచేసిన విద్యార్థులు ఉన్నత విద్యకు సంబంధించిన గేట్ వంటి ర్యాంకులు సాధిస్తున్నారు. కొందరు విద్యార్థులు ఇండియన్ ఇంజినీరింగ్ సర్వీస్ వంటి అత్యున్నత ఉద్యోగాలకు ఎంపికవుతున్నారు. పరిశ్రమల్లో మంచి ప్యాకేజీలకు సైతం సాధిస్తున్నారు.

జూలై 11న జాబితా..

ప్రస్తుతం ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ కొనసాగుతోంది. ఈ నెల 6న నోటిఫికేషన్ విడుదల కాగా, 8వ తేదీ నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైంది. జూన్ 25 వరకు దరఖాస్తులు స్వీకరిస్తారు. జూలై 11న ఎంపికైన వారి జాబితా విడుదల చేస్తారు. జూలైలో ప్రవేశాలు పూర్తిచేసి, ఆగస్టు మొదటి వారం నుంచి తరగతులు ప్రారంభిస్తారు.

రెసిడెన్షియల్ విధానంలో బోధన

ఏడాదికి పీయూసీ ఫీజు స్ట్రక్చర్ రూ.45 వేలు కాగా, ఇంజినీరింగ్ విద్యార్థులకు రూ.50 వేలు, ఇతర రాష్ట్రాల విద్యార్థులకు రూ.1.50 లక్షలుగా నిర్ణయించారు. అర్హులైన విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపకార వేతనాలు లభిస్తాయి. తెలుపు రేషన్ కార్డు ఉన్న కుటుంబాల పిల్లలకు ఉచితంగా విద్య లభిస్తుంది. పూర్తిగా రెసిడెన్సియల్ విధానంలో బోధన జరుగుతుంది.

క్లుప్తంగా

విశేష అలంకరణలో ధ్యాన వేంకటేశ్వరుడు



ప్రత్యేక అలంకరణలో దర్శనమిస్తున్న ధ్యాన వేంకటేశ్వర స్వామి

కశింకోట: కశింకోటలోని వేంకటేశ్వరస్వామి ధ్యాన మందిరంలో శనివారం విశేష పూజలు చేశారు. స్వామి వజ్రకవచంలో దర్శనమిచ్చారు. శ్రీనివాసుడిని పుష్పమాలలు, తులసి మాలలతో నిండుగా అలంకరించారు. సహస్ర నామాలతో అర్చించారు. ఆలయ అర్చకుడు రేజేటి రామచరణాచార్యులు ఆధ్వర్యంలో కార్యక్రమాలను నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు.

ముగిసిన తిరు కల్యాణోత్సవాలు

కశింకోట: కశింకోటలోని దేవదాయ శాఖకు చెందిన రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో తిరు కల్యాణోత్సవాలు ఘనంగా ముగిశాయి. ఐదు రోజులపాటు నిర్వహించిన ఉత్సవాల్లో చివరి రోజు శుక్రవారం రాత్రి అష్టదళ పద్మార్చన, పుష్ప యాగం, పవళింపు సేవ, ద్వాదశ కాలార్చన, బేడా సేవ నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త రేజేటి శ్రీరామాచార్యులు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ప్రధాన అర్చకుడు రేజేటి సీతారామాచార్యులు, కార్యనిర్వహణాధికారి కీర్తి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

తుమ్మపాల : ఇంటర్ సప్లిమెంటరీ, అడ్వాన్స్‌డ్ పరీక్షలకు సంబంధించి రెండవ రోజు ఇంగ్లీషు పరీక్ష జరిగింది. జిల్లాలో 20 కేంద్రాల్లో జరిగిన ఈ పరీక్షల్లో మొదటి సంవత్సరం జనరల్, ఒకేషనల్‌కు సంబంధించి 5,142 మందికి గాను 4,914 మంది హాజరయ్యారు. రెండవ సంవత్సరం 612 మందికి గాను 562 మంది హాజరైనట్లు జిల్లా ఇంటర్ విద్యా శాఖ అధికారి బి.సుజాత తెలిపారు. వీరిలో మొదటి సంవత్సరం ఒకేషనల్‌కు చెందిన వారు 536 మందికి గాను 485 మంది, రెండవ సంవత్సరం 169 మందికిగాను 153 మంది పరీక్ష రాశారన్నారు.

అనకాపల్లి సినిమాలు

దర్టీ ఫెలో	: రాజా
ఫ్యూరియోసా	: సత్యనారాయణ స్క్రీన్-1
వ్యాన్	: సత్యనారాయణస్క్రీన్-2
బాక్	: షిర్డిసాయి
ఆ ఒక్కటీ అడక్కు	: పర్డిసాయి
రాజుయాదవ్	: వెంకటేశ్వర
సిల్క్ శారీ	: శ్రీసత్య
కృష్ణమ్మ	: రామచంద్ర

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు శనివారం 726 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	4,700	5,100
మొదటి రకం	3,900	4,930
రెండో రకం	3,800	4,450
మూడోరకం	3,550	4,120

రక్త నిల్వలు

అనకాపల్లి : జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 67 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-10 యూనిట్లు, బీ పాజిటివ్-35 యూనిట్లు, బీ నెగెటివ్-2 యూనిట్లు, ఓ పాజిటివ్-15 యూనిట్లు, ఓ నెగెటివ్-1 యూనిట్, ఏబీ పాజిటివ్-3 యూనిట్లు, ఏబీ నెగెటివ్-1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (9703619706) నంబరును సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి : ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శనివారం 361 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 313 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ (08924223595)ని సంప్రదించవచ్చు.

చదువుల వనం.. భవిత ఘనం

- ప్రణాళికాబద్ధమైన బోధనతో విద్యార్థులను తీర్చిదిద్దుతున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల
- ఇంటర్ సీఈసీలో జిల్లాలోనే తృతీయ స్థానం కైవసం
- వ్యాయామం, యోగా, పోటీ పరీక్షల్లో తర్ఫీదు, వైద్య సదుపాయం అందజేస్తూ తల్లిలా సాకుతున్న సరస్వతీ నిలయం

ఇంతింతై వటుడింతై అన్నట్లు ప్రభుత్వ జూనియర్ కళాశాల తొలుత చిన్న పాఠశాలలో మొదలైంది. ఆరేళ్ల పాటు అక్కడే కొనసాగి జీవీఎంసీ చొరవతో నిర్మించిన నూతన భవనంలోకి తరలింది. అక్కడే విద్యార్థులకు ఉత్తమ విద్యనందిస్తూ.. వారిని మెరికల్లా తీర్చిదిద్దుతోంది. విద్యలోనే కాకుండా అనేక రకాలుగా విద్యార్థులను తీర్చిదిద్దుతూ వారు భవిష్యత్తులో మెరుగ్గా రాణించేలా అనేక అంశాల్లో తర్ఫీదు ఇస్తోంది. యోగా, వ్యాయామం, పోటీ పరీక్షలకు దిశా నిర్దేశం చేస్తూ ప్రతి విద్యార్థి పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తోంది.

అనకాపల్లి : అనకాపల్లి కేంద్రంగా 2013లో వేల్పులవీధి టౌన్ బాలికోన్నత పాఠశాలలో ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఏర్పాటు చేశారు. అక్కడే కళాశాల దాదాపు ఆరేళ్ల పాటు నడిచిన తర్వాత 2019లో నూతన భవన సముదాయంలోకి కళాశాలను తరలించారు. అప్పటి నుంచి నేటి వరకూ కళాశాలలో ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం తరగతులు నిర్వహిస్తున్నారు. ఇక్కడ బడుగు, బలహీన వర్గాల విద్యార్థులు ఎక్కువగా చదువుతున్నారు. పదో తరగతిలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు ఈ ఏడాది ప్రవేశాలకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం మే 30వ తేదీ వరకూ మొదటి విడత ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. తరగతులు జూన్ 1వ తేదీ నుంచి నిర్వహించనున్నారు.

గ్రూప్‌ల వివరాలు..

ఇక్కడ ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ గ్రూప్‌లున్నాయి. తెలుగు, ఆంగ్ల మాధ్యమాల్లో విద్యాబోధన జరుగుతోంది. ఒక్కో గ్రూప్‌లో 88 మంది విద్యార్థులు చదివే అవకాశం ఉంది. తరగతి గదికి 44 మంది చొప్పున విద్యార్థులుంటారు. ఎంపీసీ, బైపీసీ విద్యార్థులకు సువిశాలమైన ప్రయోగ శాలలున్నాయి. ఎంపీసీ, బైపీసీ విద్యార్థులు ఏడాదికి రూ. 2,209, సీఈసీ, హెచ్ఈసీ విద్యార్థులు ఏడాదికి రూ.1309 రుసుం ప్రభుత్వానికి చెల్లించవలసి ఉంటుంది.

- ఇక్కడి లైబ్రరీలో పలువురు దేశ నేతల జీవిత చరిత్ర పుస్తకాలు, కాంపిటీటివ్ పరీక్షలకు హాజరయ్యే వారి కోసం కావలసిన పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి.



ప్రభుత్వ జూనియర్ కళాశాల

- క్రీడల్లో విద్యార్థుల నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు, శారీరకంగా వారిని దృఢంగా మలిచేందుకు ప్రతిరోజు సాయంత్రం 4 నుంచి వివిధ రకాలైన క్రీడల్లో వ్యాయామ ఉపాధ్యాయులచే ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు.
- విద్యార్థులు శారీరకంగా.. మానసికంగా మెరుగుపడేందుకు ప్రతి శనివారం రెండు గంటలపాటు యోగా తరగతులు నిర్వహిస్తున్నారు.
- వారంలో ప్రతి శుక్రవారం క్విజ్ పోటీలు, వ్యాస రచన పోటీలు, నాటికలు, పాటల పోటీలు నిర్వహించి విద్యార్థుల్లో ఉత్తేజం నింపుతున్నారు.
- స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయం నుంచి వైద్యులు, వైద్య సిబ్బంది కళాశాలకు వచ్చి విద్యార్థులకు రక్త పరీక్షలు నిర్వహించి చిన్నచిన్న సమస్యలుంటే ఉచితంగా మందులు పంపిణీ చేస్తారు.
- ప్రతి ఆరు మాసాలకు ఒకసారి ప్రతి విద్యార్థికి కంటి, దంత పరీక్షలు నిర్వహించి, ప్రథమ చికిత్సపై అవగాహన కల్పిస్తున్నారు.
- ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు చదువులో చక్కగా రాణించేందుకు ప్రత్యేక శిక్షణతో పాటు, కెరియర్ అభివృద్ధికి కావలసిన శిక్షణ అందజేస్తున్నారు.
- ఈ ఏడాది మేలో మండలంలో పలు గ్రామాల్లో జూనియర్ కళాశాల అధ్యాపకులు పదో తరగతి పాసైన విద్యార్థుల ఇళ్లకు వెళ్లి కళాశాల గురించి చెబుతూ.. ఇక్కడున్న సదుపాయాలు, వసతుల గురించి తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నారు. వారి పిల్లల్ని కళాశాలలో చేర్పించాలని కోరుతున్నారు.



కళాశాలలో యోగా చేస్తున్న విద్యార్థులు (ఫైల్)



విద్యార్థిని జ్యోతికి ప్రవేశం కల్పిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ రాధిక



కళాశాలలో చేరేందుకు తల్లిదండ్రులతో వచ్చిన వెంకుపాలెం విద్యార్థిని

బోధన బాగుంది



ప్రభుత్వ కళాశాలలో చదువుకోడం అంటే చాలా మంది తక్కువగా చూస్తున్నారు. నేను గాజువాక నుంచి అనకాపల్లి వెళ్లి అక్కడి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ చదువుతున్నాను. సీఈసీ గ్రూప్‌లో 1000 మార్కులకు గాను 844 మార్కులు సాధించి జిల్లాలో తృతీయ స్థానం సాధించాను. గాజువాక ప్రభుత్వ కళాశాలలో సీటు రాకపోవడంతో ఇక్కడ చేరాను. దూరమైనా గాజువాక నుంచి అనకాపల్లి వెళ్లి అక్కడి ప్రభుత్వ కళాశాలలో చదివి జిల్లాలో తృతీయ స్థానం సాధించినందుకు ఎంతో ఆనందంగా ఉంది.

– చీపురుపల్లి సాయి, ఇంటర్ ద్వితీయ విద్యార్థి

విద్యార్థుల ఉన్నతే లక్ష్యం



మాకు విద్యార్థుల ఉన్నతే ముఖ్యం. మా కళాశాలలో ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నాం. విద్యార్థులు దరఖాస్తు చేసి నచ్చిన కోర్సులో ప్రవేశం పొందవచ్చు. పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన సర్టిఫికెట్, విద్యార్థి, తల్లిదండ్రుల ఆధార్ కార్డులు, తల్లి బ్యాంక్ ఖాతా పుస్తకం జిరాక్స్ కాపీ, విద్యార్థి, తల్లి పాస్ ఫొటోలు కళాశాలలో అందజేయాలి. కళాశాలలో విద్యతో పాటు విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దేలా అనేక అంశాలు బోధిస్తున్నాం. విద్యార్థుల మెరుగైన ఆరోగ్యం కోసం వ్యాయామం, యోగ వంటివి నిత్యం నిర్వహిస్తున్నాం.

– కె.వి.రాధిక, ప్రిన్సిపాల్, జూనియర్ కళాశాల, అనకాపల్లి.

యోగాతో నిత్య ఆరోగ్యం

అనకాపల్లి: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సొంతమవుతుందని పతంజలి యోగా సమితి భారత స్వాభిమాన ట్రస్ట్ జిల్లా అధ్యక్షుడు భీశెట్టి దొరమ్మనాయుడు అన్నారు. స్థానిక జార్జి క్లబ్ ఆవరణలో యోగా సమితి ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా గవరపాలెం పార్కుసెంటర్ వద్ద శనివారం ఏర్పాటు చేసిన బైక్ ర్యాలీని ఆయన ప్రారంభించారు. పట్టణంలో వీధుల మీదుగా స్థానిక జార్జిక్లబ్ వరకు ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యంగా జీవించాలంటే యోగా ఒక్కటే సరైన మార్గం అన్నారు. ప్రాణాయామం, ధ్యానం ద్వారా శ్వాస సంబంధిత సమస్యలకు చెక్ చెప్పవచ్చన్నారు. నిత్యం యోగసాధన ద్వారా ఉత్సాహంగా ఉండవచ్చన్నారు. కార్యక్రమంలో హరిద్వారకు చెందిన పూజ్యస్వామి రితేదేవ్ మహారాజ్ జీ, రాష్ట్ర అధ్యక్షుడు జొన్నలగడ్డ శ్రీనివాస్, సీనియర్ సభ్యులు కర్రి గంగాధర్, జార్జి క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.



గవరపాలెం పార్కు సెంటర్ వద్ద బైక్‌ర్యాలీని ప్రారంభిస్తున్న భీశెట్టి దొరమ్మనాయుడు

టెన్త్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సత్కారం రేపు

అనకాపల్లి : స్థానిక మెయిన్‌రోడ్డు కోర్టు ఎదురుగా అమరజీవి పొట్టిశ్రీరాములు భవనంలో ఈ ఏడాది టెన్త్‌లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు సోమవారం సాయంత్రం 4 గంటలకు అవార్డులు, నగదు ప్రోత్సాహకాలతో సత్కరించనున్నట్లు నిర్వాహకులు పీఎంఎల్ నరసింహం శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లావ్యాప్తంగా 21 మంది విద్యార్థులను ఎంపిక చేశామన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వాసవీ వనితా క్లబ్ అధ్యక్షురాలు, రోలుగుంట జిల్లా పరిషత్ హైస్కూల్ ఆంగ్ల ఉపాధ్యాయురాలు పి.వి.ఎం.నాగజ్యోతి విచ్చేయనున్నట్లు తెలిపారు.

పాఠశాలల ప్రారంభం నాటికి వసతులు

అనకాపల్లి: ప్రభుత్వ ఆదేశాల మేరకు జూన్ 12 నుంచి పాఠశాలలు పునఃప్రారంభించనున్నట్లు జ్యోతిబాపూలే హైస్కూల్ ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు తెలిపారు. విద్యార్థులు వచ్చేనాటికి పాఠశాలల్లో పూర్తిస్థాయి వసతులు కల్పిస్తున్నామన్నారు. తరగతి గదులకు సున్నాలు వేయించడంతో పాటు పాడైన బెంచీలు, డెస్కులకు మరమ్మతులు చేయిస్తున్నామన్నారు. పాఠశాలలో 5వ తరగతి విద్యార్థుల ప్రవేశానికి, ఉత్తీర్ణత సాధించిన విద్యార్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్లు జరుగుతున్నాయన్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను పాఠశాలలో చేర్చారన్నారు.



పాఠశాలలో బెంచీలకు మరమ్మతులు చేస్తున్న దృశ్యం

విద్యుత్ భద్రతపై అవగాహన



సదస్సులో మాట్లాడుతున్న డీఈఈ రామకృష్ణ



విద్యుత్ భద్రతపై ప్రతిజ్ఞ చేస్తున్న సాంకేతిక సిబ్బంది

కశింకోట: విద్యుత్ ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ భద్రత పనిముట్లను ఉపయోగించాలని ఏపీఈపీడీసీఎల్ కశింకోట డివిజనల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్.రామకృష్ణ కోరారు. విద్యుత్ భద్రతపై సాంకేతిక సిబ్బందికి స్థానిక ఏపీఈపీడీఎఈఎల్ డివిజన్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. విద్యుత్ సిబ్బంది మాత్రమే కాకుండా వినియోగదారులు, భవన నిర్మాణ కార్మికులకు కూడా విద్యుత్ ప్రమాదాలకు గురి కాకుండా సూచనలు, సలహాలను అందించాలని సిబ్బందికి సూచించారు. అనుభవజ్ఞులైన సిబ్బంది సూచనలు, సలహాలు పాటించి భద్రతా చర్యలు తీసుకుని, విద్యుత్ ప్రమాదాలను అరికట్టాలన్నారు. ఈ మేరకు సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు జి.శివ సత్యనారాయణ, ఎస్.సురేష్, బి.నిరీక్షణ్, డి.శివశంకర్‌ప్రసాద్, బి.కనకారావు, ఏఈలు వి.శివకుమార్, ఎం.దుర్గాప్రసాద్, జి.అశోక్‌కుమార్, బి.ఎల్.వి.నాయుడు, పి.శ్రీనివాస్, జె.వి.లక్ష్మణ్‌కుమార్, బీవీకే ప్రకాష్, బి.వీరేంద్ర, ఎస్.గోపి పాల్గొన్నారు.

నేడు ఆత్మీయ సమావేశం

అనకాపల్లి : స్థానిక రింగ్ రోడ్డు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆదివారం ఉదయం 10 గంటలకు పార్టీ శ్రేణులతో ఆత్మీయ సమావేశం నిర్వహిస్తున్నట్లు పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీ రామరాజు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్ విచ్చేస్తారని తెలిపారు. కార్పొరేటర్లు, దేవాలయాల చైర్మన్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరు కావాలని కోరారు.

గడ్డి విక్రయాలతో రైతులకు ఆదాయం

రాంబిల్లి : వరి గడ్డి వ్యాపారం దాదాపు ముగిసింది. రాంబిల్లి మండలం నుంచి ఖరీఫ్, రబీ సీజన్లలో పండించిన వరి నూర్పిడి అనంతరం గడ్డిని వ్యాపారులు కొనుగోలు చేసి ట్రాక్టర్ల సాయంతో పలు మండలాలకు తరలించి విక్రయించారు. పొలాల్లో గడ్డి కుప్పలను దాదాపు తరలించే ప్రక్రియ ముగిసింది. ఎకరాలో పండించిన వరి గడ్డి రూ.5 వేల నుంచి 6 వేలకు రైతులు వ్యాపారులకు విక్రయించారు. ఇలా కొనుగోలు చేసిన గడ్డిని పలు మండలాలకు తరలించి విక్రయాలు జరిపారు. గడ్డి విక్రయంతో రైతులకు అదనపు ఆదాయం సమకూరింది.

ఉత్సాహంగా డ్రాయింగ్, ఆటల పోటీలు



కొత్తకోట గ్రంథాలయంలో వేసిన చిత్రాలను ప్రదర్శిస్తున్న బాలలు



విద్యార్థులతో పుస్తకాలు చదివిస్తున్న చౌడువాడ గ్రంథాలయాధికారి పద్మావతి

రావికమతం: వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా మండలంలోని కొత్తకోట శాఖా గ్రంథాలయంలో బాల బాలికలకు నిర్వహించిన ఆటలు, డ్రాయింగ్ పోటీలు ఉత్సాహంగా సాగాయి. వీటితో పాటు పుస్తకాలు చదవడం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన వారికి వచ్చేనెల 7వ తేదీన నిర్వహించే ముగింపు కార్యక్రమంలో బహుమతులు అందజేస్తామని వరహామణి తెలిపారు.

కె.కోటపాడు : వేసవి విజ్ఞాన శిబిరాన్ని వచ్చే నెల 8వ తేదీ వరకూ నిర్వహించనున్నట్లు చౌడువాడ శాఖా గ్రంథాలయాధికారి ఎం.పద్మావతి తెలిపారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా చౌడువాడ గ్రంథాలయం వద్ద శనివారం విద్యార్థులతో నీతి కథలు చదివించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ శిబిరం వల్ల విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుందని చెప్పారు.



రోలుగుంట గ్రంథాలయంలో పుస్తకాలు చదువుతున్న విద్యార్థులు

రోలుగుంట: స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాలు కొనసాగుతున్నాయి. శనివారం విద్యార్థులతో నీతి కథలు చదించారు. నిజాయితీగా ఉండడం,దాని వల్ల కలిగే మేలు గురించి గ్రంథాలయాధికారి వివరించారు.

మృతుని కుటుంబానికి ఆపన్నహస్తం

కశింకోట : స్థానిక గవరపేటకు చెందిన కౌలు రైతు పాలమరశెట్టి జగ్గారావు మృతి చెందగా అతని కుటుంబానికి ప్రజా సంఘాల ప్రతినిధులు శనివారం పాడి ఆవును అందజేసి ఆసరాగా నిలిచారు. అప్పుల బాధ భరించలేక జగ్గారావు గత ఏడాది జూన్‌లో ఆత్మహత్య చేసుకున్నాడు. ఎవరి నుంచి ఎటువంటి సహకారం లేక కుటుంబం ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో రైతు స్వరాజ్య వేదిక కో-కన్వీనర్ గాడి బాలు, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు పాత్రపల్లి వీరు, జిల్లా సహాయ కార్యదర్శి కోరుకొండ నాగరాజు పాడి ఆవును కొనుగోలు చేసి అందజేశారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని కోరారు.



కౌలు రైతు కుటుంబానికి పాడి ఆవును అందజేస్తున్న ప్రజా సంఘాల ప్రతినిధులు

3న పలు దేవాలయాల భూములకు వేలం

మునగపాక : మండలంలోని పలు దేవాలయాల భూముల కౌలుకు జూన్ 3న వేలంపాట జరుగుతుందని దేవదాయ శాఖ కార్యనిర్వాహక అధికారి పి.సత్యనారాయణ మూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. పాటిపల్లిలో 3.48 ఎకరాలు, ఒంపోలుకు సంబంధించి 1.92 ఎకరాలు, అనకాపల్లి సోత్‌కు సంబంధించి 1.96 ఎకరాలు, తోటాడకు సంబంధించి 1.78 ఎకరాలు వెరసి 9.14 ఎకరాల మేర దేవదాయ శాఖకు చెందిన భూములున్నాయన్నారు. సంబంధిత భూములకు వేలం పాట నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. పాటిపల్లిలోని అహోబిల లక్ష్మీ నరసింహస్వామి ఆలయ ప్రాంగణంలో జూన్ 3వ తేదీన ఉదయం 11 గంటలకు వేలం పాట జరుగుతుందన్నారు. మూడేళ్ల కాల పరిమితికి వేలం పాట ఉంటుందన్నారు. 04-06-2024 నుంచి 03-06-2027 వరకు కాల పరిమితి ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని పాటదారులు సద్వినియోగం చేసుకోవాలని మూర్తి కోరారు.

పర్తి యాత్రకు సత్యసాయి భక్తులు తరలిరావాలి

దేవరాపల్లి: పుట్టపర్తిలో అక్టోబర్‌లో జరిగే పర్తియాత్రకు జిల్లా వ్యాప్తంగా వేలాదిగా సత్యసాయి భక్తులు తరలిరావాలని భగవాన్ సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు కశిరెడ్డి అప్పలనాయుడు కోరారు. మండలంలోని పెదనందిపల్లిలో శనివారం సత్యసాయి సేవా సమితి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సత్యసాయి బాబా చిత్రపటం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కశిరెడ్డి అప్పలనాయుడు మాట్లాడుతూ పుట్టపర్తిలో ఏటా మాదిరిగా అక్టోబర్ 23 నుంచి 25 వరకు పర్తి యాత్ర ఘనంగా జరుగుతుందన్నారు. ఈ యాత్రకు జిల్లాలోని అన్ని మండలాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చేలా అందరూ కృషి చేయాలన్నారు. ఎప్పటి మాదిరిగా ఆధ్యాత్మిక సమావేశాలు, భజనలు, బాల వికాస్ తరగతులు యథావిధిగా కొనసాగించాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో దేవరాపల్లి మండల సత్య సాయి సేవా సమితి నూతన అధ్యక్షుడిగా ఆదిరెడ్డి చినకన్నబాబును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో నౌడు అప్పారావు, గంధం సూర్యం, రమామణి, సీహెచ్.వి. రవిశంకర్, జగన్నాథం తదితర సత్య సాయి సేవా సమితి ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.



పెదనందిపల్లిలో సత్యసాయి బాబా చిత్రపటం వద్ద పూజ చేస్తున్న జిల్లా అధ్యక్షుడు అప్పలనాయుడు

సాగుకు 'మార్గం' సుగమం

- అడవిరాజుబాబు కొండపైకి రోడ్డు నిర్మాణం ప్రారంభం
- తీరనున్న 20 ఏళ్ల కల
- హర్షం వ్యక్తం చేస్తున్న ఎస్సీ రైతులు



కొండపైకి వేసిన రహదారిని శనివారం పరిశీలిస్తున్న ఏపీవో, ఫీల్డ్ ఉద్యోగి

రావికమతం: మండలంలోని ఒమ్మవరం ఎస్సీ రైతుల 20 ఏళ్ల కల సాకారం కానుంది. వారు వ్యవసాయం చేసేందుకు మార్గం సుగమమైంది. ఎమ్మెల్యే కృషి ఫలితంగా రోడ్డు సదుపాయం అందుబాటులోకి వస్తుండడంతో పాటు వారి పొలాలు సాగులోకి రానుండడంతో అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఒమ్మవరం శివారులో ఉన్న అడవిరాజుబాబు కొండపై సాగుకు అనుకూలమైన 52 ఎకరాల భూమి ఉంది. దీనిని సాగుచేసుకునేందుకు 15 మంది ఎస్సీ రైతులకు 20 ఏళ్ల క్రితం అప్పట్లో ప్రభుత్వం పట్టాలిచ్చింది. అయితే కొండపైకి సరైన రహదారి సౌకర్యం లేకపోవడంతో ఆ రైతులు వ్యవసాయం చేయలేకపోయారు. కొండంతా చెట్లు పెరిగిపోయి అడివిలా మారిపోయింది. దీనిపై ఇన్నాళ్లు ఎవరూ శ్రద్ధ చూపకపోవడంతో ఆ రైతులు కూడా కూలిపనులు చేస్తూ కుటుంబాలను పోషిస్తున్నారు. రెండు నెలల క్రితం కొండపైకి రోడ్డు వేయాలని ఆ రైతులు ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీని కోరారు. స్పందించిన ఆయన ఉపాధి హామీ పథకంలో రహదారి నిర్మించి, ఆ రైతుల జీవన ప్రమాణం మెరుగుపరచాలని అధికారులకు సూచించారు. కొండపైకి రహదారి నిర్మాణానికి సాధ్యాసాధ్యాలను అధికారులు పరిశీలించారు. ఒక కిలోమీటరు మేర ఘాట్ మాదిరిగా కొండ తొలచి రోడ్డువేయవచ్చని నిర్ణయానికి వచ్చారు. కొండపై ఉన్న భూములను సైతం అభివృద్ధి చేసి సాగులోకి తేవాలని నిర్ణయించారు. ఈ మేరకు ఉపాధి హామీ పథకం ఏపీవో దాడి వెంకట కాశి అప్పారావు, ఫీల్డ్ అసిస్టెంట్ రామకృష్ణ, టెక్నికల్ అసిస్టెంట్ బైరాగి శనివారం పనులను ప్రారంభించారు. రోజుకు 250 మంది కూలీలను ఉపయోగించి పనులు చేస్తామని ఈ సందర్భంగా ఏపీవో కాశి అప్పారావు తెలిపారు.



రహదారి నిర్మాణ పనుల్లో కూలీలు

అరటి సాగులో మెలకువలపై అవగాహన



అరటి గెలలకు కవరు కట్టడంపై అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

రావికమతం: అరటి సాగులో మెలకువలపై ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం విద్యార్థులు మేడివాడ రైతులకు శనివారం అవగాహన కల్పించారు. గ్రామీణ వ్యవసాయంలో మెలకువలు, యాంత్రీకరణ పద్ధతులను రైతులకు వివరించే కార్యక్రమంలో భాగంగా మేడివాడ గ్రామానికి చెందిన గొర్లె కృష్ణ,గంటా నాయుడు అరటి తోటలను వారు పరిశీలించారు. గెలలకు కవరు కట్టే విధానాన్ని వివరించారు. కవరు కట్టడం వల్ల కలిగే ప్రయోజనాలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పీసీ రాజ్‌కుమార్, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.